క్లుప్తంగా

రుద్రవరం ఎస్‌ఐగా వరప్రసాదు



రుద్రవరం: రుద్రవరం మండల ఎస్‌ఐగా వరప్రసాదు శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకే ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన నిరంజన్‌రెడ్డి సెలవుపై వెళ్లారు. నాటి నుంచి నేటి వరకు ఏఎస్‌ఐలతోనే పోలీస్ స్టేషన్ నచింది. ప్రస్తుత ఎస్‌ఐల బదిలీల్లో ఉన్నతాధికారులు వరప్రసాదును నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఏఎస్‌ఐలు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

రెవెన్యూ సదస్సులు వాయిదా

శిరివెళ్ల: ఈనెల 16 నుంచి జరగాల్సిన రెవెన్యూ సదస్సులు ఉద్యోగుల బదిలీల కారణంగా వాయిదా పడినట్లు తహసీల్దార్ పుష్పకుమారి శనివారం తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేసిన ఆర్డీటీ సిబ్బంది

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నయ్య స్వామి చెంచుగూడెంలో శనివారం విద్యార్థులకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) సిబ్బంది దుస్తులను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి బలరాం మట్లాడుతూ చిన్నయ్యస్వామి చెంచు గూడెంలో 42 మందికి దుస్తులు పంపిణీ చేశామన్నారు. ఇంకా గాజులపల్లె, హరినగరం, అహోబిలంలోని బండ్లగడ్డ, కొత్తకాలనీ, చాగలమర్రిలోని డీ.వనిపెంట గూడేల విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేయనున్నామన్నారు.

డీటీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన మాధవ్

దొర్నిపాడు: స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌గా మాధవ్ శనివార బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి డీటీ రవిని కలెక్టరేట్‌కు కలెక్టరేట్‌లో పని చేసే మధవర్‌ను దొర్నిపాడుకు జిల్లా అధికారులు బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. జూనియర్ అసిస్టెంట్ చిన్నగోవిందు, సీనియర్ అసిస్టెంట్ మాధవీ, వీఆర్‌ఓలు సాంబశివుడు, సావిత్రి, నాగేష్, మురళీ తదితరులు డీటీని కలిసి అభినందనలు తెలిపారు.

ఎస్‌ఎంసీల చైర్మన్లు ఏకగ్రీవం



శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఏర్పాటు

శిరివెళ్ల: మండలంలో వాయిదా పడిన రెండు పాఠశాలల స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఎన్నికలు శనివారం జరిగాయి. కూటమి కార్యకర్తల తర్జనభర్జన అనంతరం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తాహెరూన్, వైస్ చైర్మన్‌గా ఫరూఖ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వనికినిదిన్నె ప్రాథమికోన్నత పాఠశాల కమిటీ కూడా నాయకుల ఏకాభిప్రాయంతో కమిటీ ఎన్నిక సుఖాంతమైంది. చైర్మన్‌గా సుదర్శననాయుడు, వైస్ చైర్‌పర్సన్‌గా లక్ష్మీదేవి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను విద్యార్థుల తల్లితండ్రులు, టీచర్లు అభినందించారు.

ముగిసిన శిక్షణ



శిక్షణకు హాజరైన అధ్యాపకులు


నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎల్‌ఎంఎస్ కంటెంట్ జనరేషన్‌పై ఆరు రోజుల పాటు జరిగిన శిక్షణ శనివారం ముగిసింది. శిక్షణకు 11 కళాశాలల నుంచి 135 మంది అధ్యాపకులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. ఆమె మాట్లాడుతూ డిజిటల్ స్టూడియోను ఉపయోగించుకొని వీడియో ద్వారా లెసెన్‌ను రికార్డు చేశామన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు సింగిల్ మేజర్ కోర్సులకు సంబంధించిన కంటెంట్ ద్వారా సిలబస్‌ను డెవలప్ చేస్తారని చెప్పారు. శిక్షణ కార్యక్రమంలో బడేసాహెబ్, పోతురాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముస్లిం జేఏసీ కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): పట్టణ ముస్లిం జేఏసీ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం జేకే ఫంక్షన్ హాల్‌లో జరిగింది. వ్యవస్థాపకులు అబులైజ్, అబ్దుల్‌సమ్మద్, ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మౌలానా అబ్దుల్లా రషీద్, కో కన్వీనర్లుగా అబ్దుల్‌గఫార్, సద్దాంహుసేన్‌ను, మరో 22 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ముఫ్తీరఫీ, మౌలానా అఫీజ్ అంజాద్, జుబేర్‌బాషా, బాబాఫక్రుద్దీన్, అక్బర్ హుసేన్ పాల్గొన్నారు.

ఊపందుకున్న రాఖీల కొనుగోళ్లు

- ఈనెల 19న రాఖీ పౌర్ణమి
- ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో రాఖీలు





వివిధ రంగుల్లో లభ్యమవుతున్న రాఖీలు

గోస్పాడు: రాఖీ పండుగ వచ్చిందంటే చాలు మార్కెట్‌కు కొత్త కళ వస్తుంది. మిఠాయిలతో పాటు రంగు రంగుల, విభిన్న రాఖీలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఈనెల 19వ తేదీన రాఖీ పౌర్ణమి సందర్భంగా ఇప్పటికే రాఖీల కొనుగోళ్లు ఊపందుకున్నాయి.అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి, ఆప్యాయతను చాటేందుకూ ఓ రోజుంది. అదే రాఖీ పౌర్ణమి. సోదరులకు అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టే సంప్రదాయం అనాదిగా వస్తుంది. రాఖీ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, జంద్యాల పౌర్ణమి ఇలా ఎన్నో రకాలుగా పిలుచుకుంటారు. ఈ పండుగ సొంత సోదరులతో పాటు సోదర భావంతో అనుబంధానికి గుర్తుగా బంధాలను పెంచేలా వేడుక నిర్వహిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో విభిన్న రకాల రాఖీలు లభిస్తున్నాయి. అధికంగా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి నూతన మోడల్స్ తెచ్చి స్థానిక వ్యాపారులు విక్రయిస్తున్నారు. రూ.5 మొదలు రూ.200 ధరల్లో లభ్యమవుతున్నాయి.

ఆన్‌లైన్‌లో విక్రయాలు..

ఆన్‌లైన్‌లోను ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారులు కోరిన రాఖీలను సకాలంలో వారి చెంతకు చేర్చేందుకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సైట్లు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. ధర సైతం అందుబాటులో ఉండటం ఆన్‌లైన్‌లో విక్రయాలు పెరగడానికి కారణమైంది.

అందుబాటులో కొత్త రకాలు..

పూర్వంగా రాఖీలు అనగానే వివిధ రకాలతో ఉన్న స్పాంజీలపై మెరుపు కాగితాలతో డిజైన్లు కనిపించేవి. కాలానుగుణంగా జరీక్లాత్ ముక్కలతో తీర్చిదిద్దిన రాఖీలు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం రాఖీలు అన్ని దాదాపుగా రంగురాళ్లు, దారాలు, వివిధ రకాల చిత్రాలు, స్లోగన్ ఉండేవి ఎక్కువగా అమ్ముడుపోతున్నాయి.

ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న శారదాబాయి

నంద్యాల (న్యూటౌన్): విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కలిగిఉండాలని, ఈ మేరకు రెండునెలల పాటు ఎయిడ్స్ జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను అక్టోబర్ 11 వరకు ఎన్‌ఏసీఓ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు మేనేజర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని టీబీజే ఎస్‌పీజీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ దేశంలో సంవత్సరానికి 2.5 లక్షల మంది ఎయిడ్స్‌బారిన పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 1600 మంది, జిల్లాలలో 400 మంది ఎయిడ్స్ బాధితులున్నారన్నారు. డాక్టర్ నసీం మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ ఎయిడ్స్ గురించి ప్రజల్లో అవగాహనపై సర్వేచేయగా..వంద మందిలో 28 శాతం మాత్రమే ఎయిడ్స్ గురించి తెలుసుకున్నారన్నారు. అభిషేక్, స్వప్నకుమారి, బాగ్యమ్మ, నాగేంద్ర, ప్రిన్సిపాల్ దివాకర్, శేఖర్ పాల్గొన్నారు.

ఉధృతంగా కుందూ



కుందూలో ప్రవహిస్తున్న నీరు

నంద్యాల(అర్బన్): పట్టణం సమీపంలో ప్రవహిస్తున్న కుందూ నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో జలాశయాలు నిండుగా మారడంతో నదికి నీటిని విడుదల చేశారు. గడివేముల, నందికొట్కూరు, పోలూరు, పెసరవాయి, పులిమద్ది, రాయమాల్పురం, మునగాల, ఎర్రగుంట్ల తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు కుందూ నీటి ఉధృతిని తిలకిస్తూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. దిగువ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

వేంకటేశ్వరుడికి వెండి ఆభరణాల వితరణ



వేంకటేశ్వర స్వామికి వెండి ఆభరణాలను వితరణగా అందజేస్తున్న దృశ్యం



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వర, ఆంజనేయ, లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారికి శనివారం ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు గంధం సావిత్రమ్మ, ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్వరమ్మ, జ్యోష్ణ, యశస్వినిలు వెండితో చేయించిన పద్మపీఠం, గొడుగు విరాళమిచ్చారు. వెండి ఆభరణాలు అందజేసిన దాత, ఆయన కుటుంబ సభ్యులను కమిటీ వారు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లింగం సత్యం, నూకల క్రిష్ణమూర్తి, నల్లగట్ల వెంకటేశ్వర్లు, బోనగిరి క్రిష్ణమూర్తి, చిన్న పోలయ్య, బింగమల్ల సురేష్, టంగుటూరు శ్రీనివాసులు ఉన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగల పల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష పుజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామి వారి సన్నిధిలో కుంకుమార్చన పూజలు చేశారు.

రెడ్ల ఐక్యతను చాటుదాం



రేనాటి వీరుల కుటుంబ సభ్యులతో ఐక్యవేదిక నాయకులు

నంద్యాల(అర్బన్): పౌరుషః, త్యాగం, దాన ధర్మాలకు రెడ్డికులం ముందుంటుందని, రేనాటి సూర్యచంద్రులు పుట్టిన గడ్డ నుంచే రెడ్ల ఐక్యతను చాటుదామని అఖిల భారత రెడ్ల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ పట్నం సురేందర్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం ఉయ్యాలవాడ గ్రామంలో రేనాటి సూర్యచంద్రులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి పురాతన ఇల్లు, గ్రామం, ఊరి వాకిలి, కోటలను శనివారం నాయకులు పరిశీలించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేవలం కార్తీక వనభోజనాల వరకే రెడ్ల సంఘాలు కొన్ని పనిచేస్తున్నాయని, పార్టీలకు అతీతంగా రెడ్డి జాతిని జాగృతం చేసేందుకు ఐక్యవేదిక కృషి చేస్తుందన్నారు. సెప్టెంబర్ 1న ఉయ్యాలవాడ ఐక్యవేదిక విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రెడ్ల సంఘాల ప్రతినిధులు సమావేశానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. ఐక్యవేదిక కో కన్వీనర్ వేమా భరత్‌రెడ్డి, గుంటూరు ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి, సుహాసినిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శనగలో అధిక దిగుబడులు సాధించవచ్చు



మాట్లాడుతున్న ఏడీఆర్ జాన్సన్

నంద్యాల(అర్బన్): ఖరీఫ్‌లో కొర్ర, మినుము, సోయాబీన్ వంటి పంటల సాగు తర్వాత శనగ సాగు చేస్తే రైతులు అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చని ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ జాన్సన్ తెలిపారు. శనగ పంటకు ముందు ఎటువంటి పంటను విత్తక పోతే భూమిలో ఉష్ణోగ్రత పెరగడం, మే నెలలో తేమ శాతం తగ్గుతుందని, తద్వారా పంట దిగుబడులు ఆశించినంతగా రావన్నారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఆర్ మాట్లాడుతూ పంటలు పండించక ముందు భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఏఓ మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, అశోక్‌కుమార్, శివరామకృష్ణ, నీలిమ తదితరులు పలు పంటల సాగు గురించి వివరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళా వేదికపై కర్నూలుకు చెందిన నాగమల్లేశ్వరి బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శనతో అలరించింది. ఆనంద నాట్యగణపతిం, శివ శివ శంకర, శివతాండవం, కాలభైరవాష్టకం, ఓం నమఃశివాయా, తాండవ నృత్యకరి తదితర గీతాలకు హిమబిందు, లాస్య, వేద శ్రీ, ప్రణవి, వైష్ణవి, వర్షిణి, సాహిత్య, మనస్వి, నవ్యశ్రీ, శ్లోక, వెన్నల, దీప్తి తదితరులు నృత్య ప్రదర్శన చేశారు. అలాగే రెండో కార్యక్రమంలో భాగంగా కర్నూలుకు చెందిన వెంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం వారిచే భక్తి సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జయగణేశ, శివుని శిరస్సుపైనా, అదిగదిగో శ్రీశైలం, బ్రహ్మమురారి, ఓంకారరూపిణీ, గిరిజాశంకరా, శుక్రవారం శుభవేళ తదితర గీతాలను సాక్షి, మీనాక్షి, సునంద, విహారిక, హర్షిత, అధ్యశ్రీ, శ్రీకృతి, వైష్ణవి, గాయత్రి, పూర్ణిమ, భార్గవ్, గణేశ్, బ్రహ్మణి తదితరులు ఆలపించారు.

పోలీస్ కస్టడీలో మృతిపై ఆర్డీఓ విచారణ



మాట్లాడుతున్న ఆర్డీఓ దాసు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని మిడుతూరు పోలీసుల అదుపులో ఉన్న హుస్సేన్ అలియాస్ యోహాన్ మృతి చెందిన ఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ ఈనెల 24న బహిరంగ విచారణ చేయనున్నారు. ఈ మేరకు ఆత్మకూరు ఆర్డీఓ దాసు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఈనెల 24న ఉదయం 11 గంటలకు ఆత్మకూరు డివిజనల్ మెజిస్ట్రేట్, రెవెన్యూ అధికారి కార్యాలయంలో బహిరంగ విచారణ జరగనుంది. సంఘటనకు సంబంధించిన అధికారులు, సాక్షులు, ఇతరులు ఆ రోజు హాజరై తమ వాదనలు, సాక్ష్యాలను ఆర్డీఓకు సమర్పించవచ్చు.

నందీశ్వరునికి విశేష పూజలు



పూజల అనంతరం శనగల బసవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం ప్రాంగణంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి శనివారం త్రయోదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వస్త్ర సమర్పణ విశేషార్చనలు, నానబెట్టిన శనగలు, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

నిందితులను అరెస్ట్ చేయాలి



పద్మావతినగర్ ఆర్చ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆలమూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): కోల్‌కతాలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని, సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు.శనివారం పట్టణంలోని పద్మావతి ఆర్చ్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ వైద్య విద్యార్థి కుటుంబాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రోజురోజుకు మహిళలపై దాడులు అధికమైనా, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు షేక్‌షాహిద్, బాలాజీ పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో..

పట్టణంలో శనివారం రాత్రి ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై దాడులు అధికమయ్యాయన్నారు. వినోద్, తరుణ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

రుద్రవరం: మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఆలమూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం ఆలమూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్యశాల నుంచి గ్రామంలోని ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్న నినాదాల ప్లకార్డులు ప్రదర్శించారు.

ఈ ఆత్మకూరుకు ఏమైంది?

- పేట్రేగుతున్న రౌడీ సంస్కృతి
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆందోళన చెందుతున్న పట్టణ వాసులు

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు పట్టణం ప్రశాంతతకు, ఆధ్యాత్మిక వాతావరణానికి పెట్టింది పేరు. నిరంతరం శ్రీశైలం, మహానందికి వెళ్లే భక్తులతో ఓ రకమైన జీవకళతో ఉంటుంది. అలాంటి ఆత్మకూరు ప్రతిష్టను ఇటీవల జరుగుతున్న పలు సంఘటనలు మసకబారుస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, ఆర్‌డీటీ కాలనీలో జర్నలిస్టు మహేష్ అనుమానాస్పద ఘటన, తాజాగా బాలుడు వాహిద్ కిడ్నాప్, బావిలో శవంగా మారడంతో రౌడీ సంస్కృతి పేట్రేగి పోతోందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇంత జరుగుతున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిద్రావస్థలో నిఘా

కొందరు తమ వ్యాపారాభివృద్ధిని రౌడీల నీడలో పెంచుకోవాలని చూస్తుండగా.. ఇంకొందరు తమ కక్షలను తీర్చుకునేందుకు విష సంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. రౌడీ బ్యాచ్‌లు ఇటీవల బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి తాగడం, ద్విచక్రవాహనాలపై అతివేగంగా వెళ్లడం, సామాన్యులతో అనవసర వివాదాలకు దిగటం అడ్డుకున్న వారిపై దాడులకు తెగబడుతండటం చూస్తే పోలీసుల నిఘా కొరవడిందా లేక అధికార పక్షం శాంతిభద్రతలను గాలి కొదిలేసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ పౌరులు మాత్రం ఇలాంటి ఘటనలను జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికైప్రశాంత వాతావరణం నెలకొల్పాలని పోలీసులను, అధికారపక్షాన్ని కోరుతున్నారు.

శాంతిభద్రతలు అదుపుతప్పాయి



ఈ మధ్య కాలంలో ఆత్మకూరులో శాంతి భద్రతలు అదుపుతప్పాయి. యువత బహిరంగంగా మందు తాగడం, మోటార్ సైకిళ్లపై విచ్చలవిడిగా తిరగడం చూస్తే భయమేస్తోంది. మద్యం తాగి గుంపులుగా తిరగడంతో ఘర్షణలు తలెత్తి అవి హత్యలకు దారి తీస్తున్నాయి. పోలీసులు నిఘాను పెంచి ఇలాంటి ఘటనలు అరికట్టాలి.
– సుల్తాన్, కౌన్సిలర్, ఆత్మకూరు

పొలాల్లో తాగి అల్లరి చేస్తున్నారు



ఆత్మకూరు పట్టణానికి చెందిన కొందరు గుంపులుగా కేజీ రోడ్డుకు అటుఇటు ఉన్న పొలాల్లో కూర్చుని మందు తాగుతున్నారు. ఆ మత్తులో బైక్‌లపై మితిమీరిన వేగంతో రోడ్లపై వెళ్తూ ప్రమాదకరంగా తయారవుతున్నారు. రూల్స్ పాటించకుండా ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇలాంటి గుంపుల్లో రౌడీ షీటర్లు కూడా ఉంటుండంతో ఎవరూ ఎదిరించలేకపోతున్నారు. – లక్ష్మన్న, కరివేన

రౌడీయిజాన్ని అణచివేస్తాం



ఆత్మకూరు పట్టణంలో రౌడీల వల్ల జరుగుతున్న అరాచకాలకు ఫుల్‌స్టాప్ పెడతాం. రౌడీల నడ్డి విరగ్గొట్టి శాంతిని స్థాపిస్తాం. అధికారుల బదిలీలు, కొన్ని రాష్ట్రస్థాయి సంచలన కేసుల దర్యాప్తు ఉన్నందున విజిబుల్ పోలీసింగ్‌కు కొంత అంతరాయం ఏర్పడింది. బహిరంగ మద్యపానం చట్టరీత్యా శిక్షించ దగ్గనేరం. దాన్ని అరికడతాం.
– రామాంజి నాయక్, ఎస్‌డీపీఓ ఆత్మకూరు

మహానంది ఎస్‌ఐగా రామ్మోహన్‌రెడ్డి



బొమ్మలసత్రం: మహానంది పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా రామ్మోహన్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేసిన అనంతరం పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ఇంజిన్ బోట్లు నడిపితే కఠిన చర్యలు

పగిడ్యాల: కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో అనుమతి లేకుండా ఇంజిన్ బోట్లు నడిపితే చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నందికొట్కూరు రూరల్ సీఐ బీఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. శనివారం మండలంలోని నెహ్రూనగర్ సమీపాన ఉండే అర్లపాడు ఘాట్, మూర్వకొండ ఘాట్‌లను ఆయన సందర్శించారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు భారీగా వరద జలాలు వచ్చి చేరడం వలన 885 అడుగుల సామర్థ్యం వరకు బ్యాక్‌వాటర్ విస్తరించిందన్నారు. కృష్ణానది తీర గ్రామాలైన పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, ఎన్. ఘణపురం తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మూర్వకొండ ఘాట్, అర్లపాడు ఘాట్‌ల నుంచి ఇంజిన్ బోట్లలో ప్రయాణికులను ఆవలి ఒడ్డు తెలంగాణ రాష్ట్రం మంచాలకట్ట, చెల్లపాడు గ్రామాలకు నిర్వాహకులు బోట్లు నడపరాదని సూచించారు. ఇంజిన్ బోట్లు నడిపేందుకు పోర్ట్ అధికారుల నుంచి లైసెన్స్ తీసుకోవాలన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఆత్మకూరు: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ హెచ్చరించారు. శనివారం బండిఆత్మకూరు మండలం నారాయణపురం ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేసి, వాక్సినేషన్ పెర్ఫార్మన్స్, బీసీజీ, ఏఎన్‌సీ రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

స్వామి రెడ్డి ఆశయాలను సాధిద్దాం



స్వామి రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి కర్నూలు జిల్లా పూర్వ కార్యదర్శి స్వామిరెడ్డి ఆశయాలను సాధిద్దామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో స్వామి రెడ్డి 43వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16ఏళ్ల వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని భూస్వామ్య పెత్తందారి వ్యతిరేకంగా రైతాంగ వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. జిల్లాలో క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం లాంటి స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొని 16నెలలు జైలు శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. రవికుమార్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు లక్ష్మీదేవి, సుశీలమ్మ, రామయ్య, నాగేశ్వరరావు, ఇమ్మానియేల్, రంగారెడ్డి పాల్గొన్నారు.